క్లుప్తంగా

వరద బాధితులను ఆదుకోవాలి

కొయ్యలగూడెం: వరద బాధితులను ఆదుకోవడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సీపీఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండల కేంద్రమైన కొయ్యలగూడెం పట్టణంలో బుధవారం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు, ఆర్థికంగా సహాయం చేయడానికి పలు దుకాణాల వద్ద నుంచి విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో వెలగల రామారావు, ప్రతిపటి గంగరాజు, మట్టా రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

115 జీవో రద్దు చేయాలి


ఆందోళన చేస్తున్న కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు

చింతలపూడి: 115 జీవోను తక్షణం రద్దు చేయాలని కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ ఏరియా కమ్యూనిటీ ఆసుపత్రి ముందు ఆందోళన చేశారు. ఆసుపత్రి ముందు ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. కాంట్రాక్ట్ పద్ధతిలో చాలీ చాలని జీతాలతో ఏళ్ల తరబడి పని చేస్తున్న కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు బహుమతులు

జంగారెడ్డిగూడెం: ఎల్ఐసీ 68వ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లో జంగారెడ్డిగూడెం ప్రతిభ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కు చెందిన విద్యార్థులు బహుమతులు గెలుచుకున్నారు. వ్యాసరచన పోటీలో 8వ తరగతికి చెందిన ఏఎల్ఎస్ వైష్ణవి ప్రథమ బహుమతిని గెలుచుకోగా, కె.డింపుల్ ప్రత్యేక బహుమతిని గెలుచుకుందని ప్రిన్సిపాల్ కె.సరోజారెడ్డి తెలిపారు. చిత్రలేఖనం పోటీలో ఏడో తరగతి విద్యార్థి కె.సత్య ద్వితీయ బహుమతిని కైవసం చేసుకున్నాడన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సరోజ రెడ్డి, డైరెక్టర్ సత్యనారాయణ రెడ్డి అకడమిక్ డైరెక్టర్స్ సుభాష్ రెడ్డి, సింధుషారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

12 నుంచి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎంపికలు

జంగారెడ్డిగూడెం: ఈ నెల 12, 13 తేదీల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల లెవల్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జంగారెడ్డిగూడెం మండల కోఆర్డినేటర్ పీడీ ఎల్.జయరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు అండర్-11, అండర్-14, అండర్-17, అండర్-19 కేటగిరీల్లో జంగారెడ్డిగూడెం జెడ్పీ హైస్కూల్‌లో ఎంపికలు నిర్వహిస్తారన్నారు. ఎంపికలో పాల్గొనే విద్యార్థులు మిడ్‌డే మీల్స్ అక్విటెన్స్, గేమ్స్ ఎంట్రీఫాం, ప్రైవేట్ స్కూల్ విద్యార్థులు స్టడీ సర్టిఫికెట్, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ వెంట తెచ్చుకోవాలన్నారు. ఉదయం 8 గంటలకు జెడ్పీ బాలుర హైస్కూల్ ప్రాంగణంలో రిపోర్ట్ చేయాలన్నారు. 12వ తేదీ అథ్లెటిక్స్, యోగా, చెస్, షటిల్, బాడ్మింటన్, 13వ తేదీ కోకో, కబడ్డీ, వాలీబాల్ పోటీలకు ఎంపికలు చేస్తారని తెలిపారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం


మేడంకి తులసమ్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కంభం విజయరాజు

కామవరపుకోట: కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీ అన్ని విధాల అండగా ఉంటుందని చింతలపూడి నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు అన్నారు. బుధవారం కొత్తూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మేడంకి జీవం లక్ష్మణ్ తల్లి తులసమ్మ, మరో కార్యకర్త కొంగర సుభాకర్ మేనమామ ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ధైర్యంగా ముందుకు పోవాలని, ఐకమత్యంతో అందరూ కలిసి పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మేడంకి పద్మ, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పంతగాని వెంకన్న, మెరుగు బాబురావు, బందేల ప్రభాకర్, మేడం చిన్న, మల్లా సురేష్, మానుకొండ బాబురావు, టోకురి విజయకుమార్ పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం

పెదపాడు : ఇటీవల కురిసిన వర్షాలకు గోగుంట గ్రామం నీట మునగడంతో నిరాశ్రయులైన కుటుంబాలకు దాతల సాయంతో వసంతవాడ గ్రామస్తులు వరద బాధితులకు చీర, పప్పులు, నూనె, బియ్యం కూరగాయాలు, మందులు అందించారు. గోగుంటలో బుధవారం 100 కుటుంబాలకు ఈ సాయం అందించారు. వసంతవాడ గ్రామానికి చెందిన ముక్కు సత్యనారాయణ (హైదరాబాదు), డాక్టర్ అక్కేన శ్రీరామ మూర్తి (విజయనగరం), సీహెచ్ రంగారావు (విజయవాడ), ఎం ఆనందరావు(విజయవాడ), జి.సుబ్రహ్మణ్యం (బెంగుళూరు), ఏసుబాబు (హైదరాబాద్), విశ్వం, అర్జునరావుల ఆర్థిక సాయం అందించారు. స్థానిక నాయకులు ముక్కు అనందరావు, గంగాడ వెంకట్రావు, ముక్కు రామచంద్రరావు, దానకర్ణ, తమలాల శ్రీనివాస్, పరమేశ్వరరావు, అయూబ్‌ఖాన్ పాల్గొన్నారు.


జంగారెడ్డిగూడెం రూరల్: గణనాథుడి ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం


జంగారెడ్డిగూడెం: గణపతికి పూజలు చేస్తున్న భక్తులు

గణపతి బప్పా.. మోరియా.. !

- మహోదరుడిగా మహా గణపతి
- డప్పు వాయిద్యాలు, కోలాట ప్రదర్శనలతో ఊరేగింపులు

కొయ్యలగూడెం: గణేష్ ఉత్సవాలలో భాగంగా ఐదో రోజు బుధవారం మహోదరుడిగా మహా గణపతి పూజలు అందుకున్నాడు. వినాయక చవితి నవరాత్రులలో భాగంగా రోజుకో పేరున స్వామివారిని కొలుస్తున్నట్లు అర్చకులు గుడిపూడి శేషాచార్యులు తెలిపారు. అంకాలగూడెం బాల గణపతి శిబిరం వద్ద చిన్నారుల ఆధ్వర్యంలో అన్న సమారాధన కార్యక్రమం స్ఫూర్తిదాయకంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రసాదంగా భక్తులు సమర్పించిన లడ్డూల వేలం పాటను నిర్వహించి, ప్రసాదం పంపిణీ చేశారు. గవరవరం మేదర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అన్న సమారాధన, స్వామివారి ఊరేగింపు నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు.


ఐదో రోజు గణపతి ఉత్సవాలు

జంగారెడ్డిగూడెం: విజయదుర్గమ్మ ఆలయంలో 13వ వినాయక వార్షికోత్సవ వేడుకలు 5వ రోజు కొనసాగాయి. ఆలయ శాశ్వత కమిటీ చైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణ, వినాయక కమిటీ ఇన్‌చార్జి రామిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు సుదర్శనం వేణుగోపాలచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి గరిక పూజ నిర్వహించారు. చండీహోమం ఉభయదారులుగా మారిశెట్టి అంజన్‌కుమార్ దంపతులు, యర్రం ఉదయ్ కుమార్ దంపతులు, తడికమల్ల శివకుమారు దంపతులు, చిన్ని జయలక్ష్మి, వందనపు బాలత్రిపుర సుందరి, పరిపూర్ణ, పామర్తి బేబీ సరోజినీ, దూసనపూడి పద్మావతి వ్యవహరించారు. కార్యక్రమంలో స్థానిక రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు చిన్ని రామసత్యనారాయణ, జయ దంపతులు, బ్రహ్మశ్రీ ఈమని శశి కుమార్, పెనుమర్తి రామకుమార్, ఆలయ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

వాడవాడలా నిమజ్జన ఊరేగింపులు

జంగారెడ్డిగూడెం రూరల్: మండల వ్యాప్తంగా గణనాథుడి నిమజ్జన ఊరేగింపులు ఘనంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, కోలాట ప్రదర్శనలు, విచిత్ర వేషధారణ నృత్యాలతో స్వామి వారి ఊరేగింపులు నిర్వహించారు. లక్కవరంలో దేవాతా మూర్తులు కొలువైన ప్రత్యేక వాహనంలో వినాయకుడి ఊరేగింపు నేత్రపర్వంగా సాగింది. కొంగువారిగూడెం కెకెఎం ఎర్రకాలువ జలాశయం ప్రాంతంలో విగ్రహాలను నిమజ్జనం చేశారు.


కొయ్యలగూడెం: వినాయక విగ్రహం ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం


పోలవరం రూరల్: కోండ్రుకోట ఆర్అండ్ఆర్ కాలనీలో నెలకొల్పిన భారీ వినాయకుడి విగ్రహం

కుక్కునూరు: వినాయకచవితి పండుగను పురస్కరించుకొని మండలంలో పలు గ్రామాలలో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. బుధవారం వినాయక నవరాత్రులు ఐదో రోజు కావడంతో పలు మండపాల నుంచి వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. డప్పులు వాయిస్తూ బాణాసంచా కాల్చుతూ గణపతి పప్పా మోరియా అంటూ యువతి, యువకులు డీజే నృత్యాలతో రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా ఊరేగింపు నిర్వహించారు. నిమజ్జనంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కమిటీ సభ్యులు తగు జాగ్రత్తలు తీసుకున్నారు.

పోలవరం రూరల్: పోలవరం మండలం కోండ్రుకోట ఆర్అండ్ఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహాన్ని భారీగా ఊరేగిస్తూ పట్టిసీమ రేవులో గోదావరి నదిలో బుధవారం నిమజ్జనం చేశారు. గత ఐదు రోజులుగా వినాయక మహోత్సవాల్లో భాగంగా గణనాథుడికి పూజలు నిర్వహించారు. లడ్డూ వేలం నిర్వహించారు. బుధవారం నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వాడపల్లి , కోండ్రుకోట గ్రామస్తులు కరకం కుమారి, పూనెం ప్రియాంక, కుంజం దుర్గాదేవి, పూనెం దుర్గ, కుంజం మురళి, కరకం లక్ష్మణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల: గణపతిబప్పా మోరియా.. నినాదాలు ద్వారకా తిరుమల క్షేత్ర పురవీధుల్లో మారుమోగాయి. డప్పు వాయిద్యాలు, డీజే సౌండ్ల హోరు, యువకుల నృత్యాల నడుమ బుధవారం గణేష్ నిమజ్జన వేడుక అట్టహాసంగా నిర్వహించారు. స్థానిక తూర్పు వీధిలో లంబోదర వినాయక కమిటీ వారు నెలకొల్పిన గణనాథుడికి ముందుగా ఉత్సవ కమిటీ సభ్యులు పూజాధికాలను నిర్వహించారు. అనంతరం క్షేత్ర పుర వీధుల్లో ఊరేగించి, స్థానిక కోనేరులో నిమజ్జనం చేశారు.


ద్వారకాతిరుమల: యువకుల ఆనందోత్సాహాల నడుమ ఊరేగింపు


కుక్కునూరు: నిమజ్జనానికి తరలిస్తున్న గణేష్ విగ్రహం

అడుగడుగునా అసమర్థత

మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు


మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

కొయ్యలగూడెం: విజయవాడలో రెండున్నర లక్షల మంది ప్రజలు వరద పీడితులుగా మిగలడానికి, సుమారు యాభై మందికి పైగా మరణించడానికి కూటమి ప్రభుత్వం అసమర్థత, వారి అనుయాయుల కోసం చేసిన స్వార్థం కారణమని పోలవరం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆరోపించారు. బుడమేరు వరద ఉధృతి గురించి పీడబ్ల్యూడీ డీఈ నాయక్ ఆగస్టు 31న తహసీల్దార్, ఇరిగేషన్ శాఖ చీఫ్‌లకు లేఖ రాసినప్పటికీ తగిన సమయంలో స్పందించలేదన్నారు. బుడమేరు గేట్లు నాలుగు గంటలకు పైకి లేపుతామని లేఖలో పేర్కొన్నారన్నారు. ప్రభుత్వం మీడియా ద్వారా, పోలీస్ బలగాలను ప్రజలకు సమాచారం చేరవేయడంలో, అప్రమత్తత చేయడంలోనూ ఘోరంగా విఫలమయ్యారన్నారు. గేట్లు ఎత్తిన పిదప పది గంటల సమయాన్ని సద్వినియోగం చేసుకొని ఉంటే పది రోజులు విజయవాడ నగరవాసులు అనుభవించిన నరకయాతనలు, మరణాలు ఉండేవి కావన్నారు. చంద్రబాబు నాయుడు తన నివాసం మునిగిపోకుండా, ఏబీఎస్ రాధాకృష్ణకు చెందిన యాక్టివ్ పవర్ ప్లాంట్ ముంపునకు గురి కాకుండా బుడమేరు నుంచి వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ ద్వారా విజయవాడ వాసులపైకి వరద నీరు వదిలారన్నారు. 1968, 1986, 1990, 2005 సంవత్సరాలలో ఇంతకుమించిన తుఫాన్, భారీ వరదలు సంభవించాయని కానీ నాటి ముఖ్యమంత్రులు వాటిని సమర్థవంతంగా ఎదుర్కొన్నారన్నారు. తాను విజన్ కలిగిన ముఖ్యమంత్రి అని ప్రచారం చేసుకునే చంద్రబాబు ముందుస్తు విపత్తును కనిపెట్టలేకపోవడం విజయవాడ ప్రజల దురదృష్టమన్నారు. అధికారులను పరిగెత్తించడం, పబ్లిసిటీ పిచ్చి తప్ప చంద్రబాబు నాయుడు వరద బాధితులను ఆదుకున్నది లేదన్నారు, వరద బాధితులను ఆదుకోవడానికి వస్తున్న విరాళాలపై శ్వేత పత్రం విడుదల చేయాలని బాలరాజు డిమాండ్ చేశారు. చంద్రబాబుకు, ఏబీఎస్ రాధాకృష్ణలకు తొత్తులుగా వ్యవహరించి, నిర్లక్ష్యానికి కారణమైన ఇరిగేషన్ ముఖ్య అధికారులపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలన్నారు.

అటవీశాఖ అమర వీరుల దినోత్సవం


కొయ్యలగూడెం: అమరవీరులకు జోహార్లు అర్పిస్తున్న అటవీ శాఖ సిబ్బంది


కుక్కునూరు: ర్యాలీ చేస్తున్న అటవీశాఖ ఉద్యోగులు

కొయ్యలగూడెం: అటవీ శాఖ అమరవీరుల దినోత్సవం బుధవారం కన్నాపురం అటవీ శాఖ కార్యాలయంలో నిర్వహించారు. రేంజర్ కె.కృష్ణకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విధి నిర్వహణలో అసువులు బాసిన అధికారులకు, సిబ్బందికి జోహార్లు అర్పించి నివాళులు ఘటించారు. ఐఎస్ఎఫ్ అధికారి పందిళ్లపల్లి శ్రీనివాస్‌ను గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్ బలి తీసుకున్నారని, ఆయన వీరోచిత ప్రాణత్యాగంతో అటవీశాఖ అమరవీరుల దినోత్సవం నిర్వహిస్తున్నామని కృష్ణకుమారి పేర్కొన్నారు. అటవీ శాఖ అధికారులు, సిబ్బంది స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

కుక్కునూరు: జాతీయ అటవీ అమర వీరుల సంస్మరణ దినం సందర్భంగా బుధవారం స్థానిక ఫారెస్ట్ రేంజ్ కార్యాలయం నుంచి ఉద్యోగులు అమర వీరుల త్యాగాలను స్మరిస్తూ ర్యాలీ చేశారు. అనంతరం రేంజ్ కార్యాలయంలో అమర వీరుల చిత్రపటాలను పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. డీఆర్‌వో టి.కేసరి మాట్లాడుతూ, విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన అమర వీరుల త్యాగాలు వెలకట్టలేమన్నారు. కార్యక్రమంలో కుక్కునూరు అటవీశాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వరద సాయంపై బయటపడ్డ డొల్లతలం

సాక్షి, టాస్క్‌ఫోర్స్: గత నెల ఆగస్టు గోదావరి వరదల నేపథ్యంలో కుక్కునూరు మండలంలోని గొమ్ముగూడెం నిర్వాసితులకు దాచారం పంచాయతీలోని ఆర్అండ్ఆర్ కాలనీలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రానికి వచ్చిన మంత్రులు, ఆ పార్టీ నేతలు నిర్వాసితులకు అందుతున్న తీరుపై మాట్లాడిన మాటలు పచ్చి అబద్ధాలన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అందుకు నిదర్శనంగా సొంత పార్టీకి చెందిన వారే పునరావాస కేంద్రాల్లో కనీసం మంచి నీరు కూడా అందించలేదంటూ ఆ పార్టీ నాయకులపై మంగళవారం వాగ్వాదానికి దిగిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. గోదావరి వరద ఉధృతి నేపథ్యంలో మంగళవారం ముంపు గ్రామానికి చెందిన బాధితులను ఖాళీ చేయించేందుకు వెళ్లిన మండల స్థాయి నాయకులకు ఈ చేదు అనుభవం ఎదురైంది. సొంత పార్టీకి చెందిన వారే మాకు సరిగా సాయం అందించలేదని విమర్శలు చేయడంతో ఆ పార్టీ నాయకులు విస్తుపోయారు. గోదావరి వరద బాధితులను ఆదుకోవడం పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు మేడిపండు పద్యం మాదిరి ఉందని ఆ వీడియో చూసిన ప్రజలు నవ్వుకుంటున్నారు.

ఎన్నేళ్లు.. వరద కష్టాలు..?

- ప్యాకేజీ ఇచ్చేయండి... వెళ్లిపోతాం
- అధికారులను నిలదీసిన రేపాకగొమ్ము వాసులు
- వరద ముంచినా గ్రామం ఖాళీ చేయమని తేల్చిచెప్పిన గ్రామస్తులు

వేలేరుపాడు: ప్రతీ ఏటా గోదావరి వరదలకు తల్లడిల్లిపోతున్నాం. ఇప్పటికే మూడు సార్లు వరద వచ్చింది. వరద వచ్చిన ప్రతీ సారి ఇంట్లో సామాన్లు సర్దలేకపోతున్నాం. ఇంకా ఇబ్బందులు పడలేం సార్. మీరిచ్చే గోదావరి వరద నష్టం పరిహారం ఏ ఖర్చులకు సరిపోవు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వండి. గ్రామం ఖాళీ చేసి వెళ్ళిపోతామంటూ రేపాకగొమ్ము గ్రామస్తులు అధికారుల ఎదుట వాపోయారు. వేలేరుపాడు మండలంలోని రేపాకగొమ్ము గ్రామాన్ని గోదావరి వరద చుట్టుముట్టింది. గ్రామాన్ని ఖాళీ చేయించేందుకు మండల స్పెషల్ ఆఫీసర్ డ్వామా పీడీ రాము, తహసీల్దర్లు చల్లన్నదొర, సత్యనారాయణ, అధికారులు మంగళవారం సాయంత్రం వెళ్లగా ఆ గ్రామస్తులు గ్రామం ఖాళీ చేసి సురక్షిత ప్రాంతానికి వెళ్లేందుకు నిరాకరించారు. గోదావరి వరద వచ్చినా సరే మేము ఎక్కడికీ వెళ్లబోమని, ఈ బాధలు పడలేమంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఎంత సముదాయించినా వారు శాంతించలేదు. ఈ గ్రామంలో ఒక్క కుటుంబం కూడా పునరావాస కేంద్రాలకు వెళ్లలేదు. రేపాకగొమ్ము గ్రామంలో మొత్తం 428 కుటుంబాలున్నాయి. అందరికీ ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని కోరగా, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని డ్వామా పీడీ రాము హామీ ఇచ్చారు.

ముంపునకు గురైన పోలీస్ చెక్‌పోస్టు

పోలవరం రూరల్: గోదావరి వరద ఉధృతంగా పెరుగుతోంది. స్పిల్‌వే నుంచి 12.82 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు చేరుతోంది. దీంతో పోలవరం ప్రాజెక్టు ప్రాంతానికి వెళ్లే రోడ్డు మార్గంలో పోలీస్ చెక్‌పోస్టు వరద ముంపునకు గురైంది.


ప్రాజెక్టు ప్రాంతానికి వెళ్లే పోలీసు చెక్‌పోస్టు వద్ద ప్రవహిస్తున్న వరద నీరు


ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

రోడ్డు మొత్తం వరద నీటిలో మునిగింది. దీంతో ప్రాజెక్టు ప్రాంతానికి వెళ్లే రోడ్డు మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రాజెక్టు ప్రాంతానికి ఇంజనీరింగ్ అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులు వెళ్లేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసిన రోడ్డు మార్గం నుంచి రాకపోకలు సాగిస్తున్నారు.

అధికారుల పర్యటన

వేలేరుపాడు: గోదావరి వరద ప్రభావిత గ్రామాల్లో డ్వామా పీడీ రాము, జంగారెడ్డిగూడెం ఆర్డీవో అద్దయ్య బుధవారం పర్యటించారు. తూర్పుమెట్ట, పాతనార్లవరం, తిర్లాపురం గ్రామాల్లో వరద ఉధృతిని పరిశీలించారు. ఆయా గ్రామాల్లో గిరిజనుల సమస్యలు అడిగితెలుసుకున్నారు. తూర్పుమెట్ట గ్రామంలో విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో అంధకారంలో మగ్గుతున్నామని, గ్రామస్తులు చెప్పడంతో జనరేటర్ ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. విద్యుత్ శాఖ డీఈ రాధాకృష్ణ, తహసీల్దార్లు కె.చల్లన్నదొర, సత్యనారాయణ,


రుద్రమకోటలో నీటమునిగిన ఇళ్లు


సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్తున్న రేపాక గొమ్ముువాసులు


నార్లవరంలో వరద బాధితులతో మాట్లాడుతున్న అధికారులు

ఆకుకూరల ప్రాముఖ్యతపై అవగాహన

కామవరపుకోట: రక్తహీనత తగ్గాలంటే ఆకుకూరలు ఎక్కువగా తినాలని జంగారెడ్డిగూడెం డివిజన్ అంగన్‌వాడీ సీడీపీవో పి.బ్యూలా అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆకుకూరల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారంతోనే ఆరోగ్యంగా ఉంటామని ఆకు కూరలపై తల్లులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఆకుకూరల్లో మునగాకు, తోటకూర, పాలకూర, మెంతు కూర ఆహారంలో భాగంగా తీసుకోవాలన్నారు. మండల విద్యాశాఖాధికారి సీహెచ్ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం అందించే బీ కాంప్లెక్స్ మాత్రలు రక్త హీనత ఉన్న విద్యార్థినులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో బ్యూలా

కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఎస్.వీరకుమారి, బీపీఎల్ మంగాదేవి, హెచ్‌వీ సరోజినీ ఉపాధ్యాయులు కె.రమేష్, బి.కిషోర్, కె.శ్రీహరి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయవాడలో వలంటీర్ల సేవలు

దెందులూరు: సత్యసాయి సేవా సంస్థ తరపున దెందులూరుకు చెందిన వలంటీర్లు సుగ్గిశెట్టి నూకరాజు, సుగ్గిశెట్టి మణిగుప్త, హేమంత్, బ్రహ్మం, ప్రగల్లపాటి ప్రకాష్‌లు విజయవాడ వెళ్లారు. ఏడు వేల కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి 25 కేజీల బియ్యం, వాటర్ బాటిళ్లు, నిత్యావసర సరుకులు ఇచ్చామని వారు ఈ సందర్భంగా తెలిపారు.

మనసులు గెలిచిన నేత మిథున్‌రెడ్డి


మిథున్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

జంగారెడ్డిగూడెం: కుట్రలు, కుతంత్రాలు, కుయుక్తులను ధీటుగా ఎదుర్కొని వైఎస్సార్‌సీపీ ఎంపీగా గెలవడం మిథున్‌రెడ్డి ప్రజల మనసులు గెలుచుకున్న తీరుకు అద్దం పడుతుందని జంగారెడ్డిగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, వైఎస్సార్‌సీపీ పోలవరం నియోజకవర్గ పరిశీలకులు జెట్టి గురునాధరావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీవీఆర్ చౌదరి అన్నారు. జంగారెడ్డిగూడెంలో రాజంపేట పార్లమెంట్ సభ్యుడు, ఉభయగోదావరి జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్ మిథున్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను జంగారెడ్డిగూడెంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ సీనియర్‌నాయకులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తనయుడిగా పరిచయమైనా, తనదైన శైలిలో వైఎస్సార్‌సీపీలో ఎదిగారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు అచ్యుత రామయ్య, ముప్పిడి శ్రీనివాసరావు, మానవతా మూర్తి, బత్తిన చిన్న, కుక్కల ధర్మరాజు, కుర్రు రవి, పోలనాటి రవి, కౌన్సిలర్‌లు, నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు పాల్గొన్నారు.